## క్లుప్తంగా

### వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వెంకటేశ్వరస్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం పూజలు, పల్లకిసేవ గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### మురుగు కాలువలో పూడిక తొలగింపు



పొదలకూరు : పట్టణంలోని నర్సారెడ్డి కాలనీలో మురుగు కాలువలో శనివారం పూడిక తొలగింపు చేపట్టారు. దోమలు వృద్ధి చెందకుండా వార్డు సభ్యులు జయమూర్తిరెడ్డి, మూలి సతీష్‌కుమార్‌రెడ్డి కాలువల్లో పేరుకున్న చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా తొలగిస్తున్నారు. మన్నవరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### శ్మశానంలో జంగిల్ క్లియరెన్స్



పొదలకూరు : పొదలకూరు పంచాయతీ లింగంపల్లి శ్మశానవాటికలో శనివారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పంచాయతీలో పరిధిలో ఉన్న ఎనిమిది శ్మశానవాటికలను శుభ్రం చేయించి విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిందిగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించినట్లు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మిగిలిన ఏడింటిని కూడా పరిశుభ్రంగా మార్చి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఎమ్పీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత కంప్యూటర్ శిక్షణ

నెల్లూరు (టౌన్): రాష్ట్ర నైపుణ్య సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐ (బాలుర) కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కే శ్రీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణానంతరం పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు సోమవారం కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 94944 56326, 97045 10793 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### నేత్రపర్వంగా శ్రీవారికి గరుడ సేవ

నెల్లూరు రూరల్: ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం గరుడ సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత దేవదేవేరుల ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గిరిప్రదక్షణ జరిపారు. ఉభయకర్తలుగా శ్రీనివాసులురెడ్డి, వసుమతి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయశుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమాల తరువాత భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి,ఈఓ గిరికృష్ణ తెలిపారు.

### పక్షవాతంపై అప్రమత్తత అవసరం

నెల్లూరు రూరల్: పక్షవాతంపై సీనియర్ సిటిజన్లు ఎంతో అప్రమత్తంగా ఉండాలని నారాయణ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ సంపత్ సూచించారు. జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొదలకూరురోడ్డు జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్ సంపత్ మాట్లాడుతూ పక్షవాతంపై అవగాహన క ల్పించారు. అనంతరం సంపత్‌ను వాకర్స్ సత్కరించారు. జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు తుంగా నారాయణరెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, ప్రసాద్, కృష్ణయ్య, రాజగోపాల్, నీరజమ్మ, హర్షవర్ధని, హరిసుధా, సావిత్రమ్మ, అరుణ, పద్మ పాల్గొన్నారు.

# ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్ష

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్షతో సమానమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో శనివారం ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో చిన్న కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, అలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న విధానాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. ఆరోగ్యశ్రీ జాబితాలో గతంలో వెయ్యి వ్యాధులు ఉంటే ప్రస్తుతం 310 వ్యాధులను చేర్పించి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారన్నారు. ఎవరూ ఇబ్బంది పడకూడదన్న ఆశయంతోనే గ్రామస్థాయిలోనే స్పెషలిస్టు వైద్య నిపుణులతో మెరుగైన వైద్యసేవలను అందజేస్తోందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, లలితారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు మురళి, భరత్, మధుసూదన్‌రెడ్డి, రహమత్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : కేస్‌షీట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం**

కోవూరు : ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని వశిష్ట ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, వైఎస్సార్‌సీపీ పలు విభాగాల అధ్యక్షులు సుధాకర్, అనూప్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు వరం**

ముత్తుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంగా మారిందని ఎంపీపీ గండవరం సుగుణ అన్నారు. మండలంలోని దొరువులపాళెం సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొనే ఈ శిబిరాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్య నిపుణులు నిఖిత, చందనప్రియ, శ్రీనివాసులు, మౌనిక వారి సిబ్బందితో కలిసి 623 మంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఇసనాక చంద్రశేఖర్‌రెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, గోపాలరెడ్డి, సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సునందమ్మ, ఎంపీటీసీ సభ్యులు దారా శోభ, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

**చెంతకే వైద్యసేవలు**

మనుబోలు : ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకొచ్చేందుకే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. మండలంలోని పిడూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చి వారి ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు సుబ్బరాజు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఆమని రోగులను పరీక్షించి సర్పంచ్ తిక్కవరపు వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోవూరు : మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి



ముత్తుకూరు : దొరువులపాళెంలో మందుల కిట్ అందజేత



మనుబోలు : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుబ్బరాజు

### కొమరికలో పశువైద్య శిబిరం ఏర్పాటు

ఇందుకూరుపేట : మండవ ఫౌండేషన్, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొమరిక గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మైపాడు పశువైద్యాధికారి డాక్టర్ అస్లామ్‌అక్తర్, డాక్టర్ శ్రీనివాసులునాయుడు కలిసి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్బీకే పశువైద్య సహాయకులు టి.జగదీష్, జె.జశ్వంత్, గోపాలమిత్రలు అబ్దుల్ సలాం, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

### మోటార్ బైక్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాచలం : మోటారు బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై శనివారం రాత్రి జరిగింది. తిక్కవరప్పాడు పంచాయతీ జోసఫ్‌పేట గ్రామానికి చెందిన పాకం చెంచయ్య పనినిమిత్తం బైక్‌పై గుడ్లూరువారిపాళెం పంచాయతీలోని మొలకలపూడి గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డు వద్ద క్రాస్ చేస్తుండగా పోర్టు వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెంచయ్యకు తీవ్ర గాయాలవ్వగా స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

## గ్రహణంతో ఆలయాల మూత



ముత్తుకూరు : పంటపాళెంలో మూసివేసిన రామాలయం

ముత్తుకూరు : పాక్షిక చంద్రగ్రహణం కారణంగా మండలంలోని దేవాలయాల తలుపులు మూసివేశారు. పగలు నిత్య నైవేద్యాలు పెట్టి, సాయంత్రం దీపారాధన చేసిన తర్వాత ఆలయాల తలుపులను మూసివేశారు. ముఖ్యంగా ముత్తుకూరు, కృష్ణపట్నం, వల్లూరు, పోలంరాజుగుంట, బ్రహ్మదేవి, ఈపూరు, పిడతాపోలూరు, పైనాపురం గ్రామాల్లోని మహాశివుడి ఆలయాల తలుపులు మూసివేశారు. పలు గ్రామాల్లో చెన్నకేశవస్వామి ఆలయాలు, శ్రీరామమందిరాలను కూడా పొద్దుపోయిన తర్వాత మూసివేశారు. గ్రహణం వీడిన తర్వాత ఆదివారం ఉదయం సంప్రోక్షణ జరిపి, తలుపులు తీస్తామని అర్చకులు తెలిపారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కామాక్షితాయి ఆలయాన్ని మూసివేసిన అర్చకులు

**కామాక్షితాయి ఆలయం మూసివేత**

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పాక్షిక చంద్రగ్రహణం నేపథ్యంలో మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి దైవ దర్శనాన్ని నిలిపివేశారు. సాయంత్రం అర్చకులు శాస్త్రోక్తంగా ఆలయ తలుపులు మూసివేశారు. గ్రహణం అనంతరం ఆదివారం ఉదయం 7 గంటలకు ఆలయశుద్ధి, సంప్రోక్షణ, శ్రీవార్లకు నిత్య కైంకర్యం నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ తెలిపారు.

## హమాలీలకు ప్రజాసంఘాల మద్దతు

కోవూరు : మండలంలోని ఇనమడుగు సెంటర్‌లో హమాలీ కార్మికులు చేస్తున్న నిరసనలకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ), జిల్లా లారీ వర్కర్స్ యూనియన్ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు వారు మూడో రోజు కార్మికులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ నెల్లూరు నగర కార్యదర్శి బీపీ నరసింహ, లారీ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి దామోధర్‌రెడ్డి మాట్లాడుతూ హమాలీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్‌లను పరిష్కించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కోవూరు మండల కార్యదర్శి గండవరపు శేషయ్య, సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, ఆవాజ్ నాయకులు, డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.



హమాలీలకు సంఘీభావం తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

## సొంతింటి కల సాకారమే సీఎం లక్ష్యం

ఇందుకూరుపేట : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని కొమరిక గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో సునీత అనే మహిళ గృహప్రవేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉన్నాయని, లబ్ధిదారులు వేగంగా ఇళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సింధూర, వైఎస్సార్‌సీపీ నేతలు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, జి.శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



## బాబు పాపాల వల్లే జైల్లో ఉన్నాడు

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : చంద్రబాబు గతంలో చేసిన పాపాల వల్లే ప్రస్తుతం జైలులో ఉన్నాడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ప్రాణహాని ఉందని బాబు లేఖలు రాయడం సిగ్గుచేటన్నారు. బాబును చంపే అవసరం ఎవరికీ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ సాక్షిగా రైతుల మీద కాల్పులు జరిపించి ముగ్గురిని పొట్టన పెట్టుకోవడం, మహిళలని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించడం, మీ మామ ఎన్టీఆర్ మీద చెప్పులు వేయించి మానసిక హత్యకు గురి చేయించడం.. వంటివి నీ పాపాలు కాదా అని చంద్రబాబును నిలదీశారు. ఇన్ని అక్రమాలు చేశావు కాబట్టే ప్రస్తుతం జైలులో ఉన్నావని తెలియజేశారు. స్కిల్ స్కామ్ కేసులో నేరం రుజువు కావడం వల్లే చంద్రబాబు జైలులో ఉన్నాడని, ఇందులో ఎలాంటి కుట్రలు లేవని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే భువనేశ్వరి బహిరంగ సభలో మాట్లాడుతూ తమకు ప్రజాబలం ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాబు అరెస్ట్‌పై బాధపడే భువనేశ్వరి.. నాడు ఎన్టీఆర్ మీద బాబు చెప్పులతో దాడి చేయించడం, మానసికంగా హింసించినప్పుడు ఎందుకు బాధపడలేదని ప్రశ్నించారు. ఆమె ముందుగా ఎన్టీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. ఇంక ఆ బాలయ్య బాబు ఏం మాట్లాడుతాడో అతనికే అర్థం కాదని, ముందు తెలుగు సరిగ్గా నేర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కామాక్షితాయి దేవస్థానం చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, వైస్ చైర్మన్లు షాహుల్, లలితారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, అల్లాభక్షు, మోర్ల మురళి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

### ఆర్థిక సాయం అందజేత



పొదలకూరు : మండలంలోని అయ్యగారిపాళెంలో పేద కుటుంబానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని కండే శ్రీలక్ష్మికి పట్టణంలో ఆర్ ఆర్ దంతవైద్యశాల నిర్వహిస్తున్న డాక్టర్ చక్రపాణి శనివారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. విద్యార్థిని హాస్టల్ ఖర్చుల నిమిత్తం ఈ మొత్తాన్ని ఆయన అందించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ప్రసాద్, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### గాయపడిన వారికి ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లిలో సీపీఎం నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతలను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పార్టీ తరపున అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సై మహేంద్రకు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, మురళి, విల్సన్, పలువురు కౌన్సిలర్‌లు ఉన్నారు.

### మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు జిల్లాలోని రాజకీయ అంశాలపై చర్చించారు.

### భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితులు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగిన చండీ హోమంలో భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆయతు చంద్రశేఖరప్రభు దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

## వెంకయ్యస్వామి సేవలో మంత్రి కాకాణి



వెంకయ్యస్వామికి పూజలు చేస్తున్న మంత్రి కాకాణి, జేసీ కూర్మనాథ్

వెంకటాచలం : దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన గొలగమూడిలోని భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి మంత్రి కాకాణి వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని దర్శించుకున్నారు. వీరికి ఆశ్రమ కార్యనిర్వహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అంగరంగ వైభవంగా..



మనుబోలు : మహంకాళి అమ్మవారికి గ్రామోత్సవం



మనుబోలు : కోదండరామపురం వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో దసరా ముగింపు ఉత్సవాలను శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మనుబోలులో అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ, కోదండరామపురంలో హరికృష్ణ సాయిశర్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కేఆర్‌పురంలో అమ్మవారి చెంత ఉంచిన లడ్డూను వేలం వేయగా రూ.51 వేలకు మాచిరెడ్డి వెంకటరమణారెడ్డి, అమ్మవారి మెడలో వేసిన కరెన్సీ మాలను రూ.20 వేలకు చల్లా తిరుమల దక్కించుకున్నారు. అలాగే మనుబోలులో లడ్డూను రూ.17 వేలకు అన్నింగి శ్రీనివాసులు, కరెన్సీ మాలను రూ.6 వేలకు కడివేటి బ్రదర్స్ దక్కించుకున్నారు. అనంతరం మహంకాళి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసి దేవతా ప్రతిమల, ఆర్చీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన డిస్కో, తీన్‌మార్ బ్యాండ్, తెనాలి బ్యాండ్, కోలాట నృత్య ప్రదర్శన, తప్పెట్లు, మంగళ వాయిద్యాలు, వివిధ వేషధారణలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అడుగడుగునా గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయలు, పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు పట్టారు. యువకులు బాణసంచా పేలుస్తూ ఉత్సవాల వెంట కేరింతలు కొట్టారు. అర్ధరాత్రి ప్రారంభమైన ఉత్సవం శనివారం ఉదయం 10 గంటల వరకు కొనసాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఎస్ఈఏఎస్ పరీక్షతో విద్యార్థులకు మేలు

- డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్

కొడవలూరు : స్టేట్ ఎడ్యూకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్ఈఏఎస్) పరీక్ష ద్వారా విద్యార్థుల స్థాయిని అంచనా వేయవచ్చని, ఇది వారికి ఎంతో మేలు అని డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) కార్యదర్శి టీవీ రామ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, సీఆర్ఎంటీలు, హెచ్ఎంలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యవక్తగా హాజరై, మాట్లాడారు. 3, 6, 9 తరగతులకు వచ్చే నెల 3న ఎస్ఈఏఎస్ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఈ పరీక్షను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా డిగ్రీ విద్యార్థులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండలంలో 22 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించేందుకే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం ఎంఈఓ–1 జి.వసంతకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ఎస్.అంకయ్య, అకడమిక్ కో–ఆర్డినేటర్ మౌసీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్‌కుమార్